కథ

# నీలిమేఘాలు

ఖాదర్ షరీఫ్

**నేను కోల్పోయిన ఏదో జీవలక్షణం ఇప్పుడిప్పుడే నాలో ప్రవేశించటం మొదలు పెట్టింది. ఏదైనా అనుభవమే కదా మనిషిని ఒక నవీన మార్గంవైపుకు పెట్టేది. అందుకే అనుభవమే చాలా గొప్పది. రాత్రయితేగానీ చూడలేం ఆకాశం అందాన్ని. నిజం. ఆకాశం ఏమీ లేని గొప్ప అందమయిన చిత్రం. నీ అందంతో మాకేం పని అనుకోలేం మనం.**

**నేను చాలా నిర్దయుణ్ణి. ప్రేమలూ, బంధాలు వీటన్నింటిలో ఏమీలేదని అంతా కంప్యూటర్‌లోనే ఉందనుకొనే వెర్రివాణ్ణి. తప్పు చేశాను. ఆత్మీయతలూ, అనురాగాలు ఇవి కూడా అజ్ఞాతంగా మనం అనుభవిస్తున్న బ్రతుకుని నిర్దేశిస్తూనే ఉన్నాయి.**

అసలు ప్రేమలేని తనంతో మనిషి మనుగడ సాగించటం చాలా కష్టం. బయట మంచుకురుస్తూ ఉంది రహస్యంగా. మనిషితో సంబంధం లేనట్లు ముఖ్యంగా నాతో. ఇన్ని సంవత్సరాలు ఎంత ఆనందాన్ని అనుభవించకుండా కోల్పోయానో తల్చుకుంటుంటే,... అదో బాధ. 'నవీన్' బలవంతపెడ్తే వచ్చాను. నిజానికి ఇష్టంలేదు. అమ్మా, నాన్నకు తప్పదన్నట్లు వాళ్ళ మాటల్లోనే అర్థమయింది. ఆ రాత్రి వాళ్ళ మాటల్ని తల్చుకుంటుంటే... ఏదో ఆవేదన. నశించిపోతున్న మానవ సంబంధాల పర్వం. దాన్ని ఎలాగయినా కాపాడుకోవాలనే తపన ఇప్పుడు నాలో.

''నాల్గు రోజులు ముందుగా వెళ్లి ఏం చేస్తాం అక్కడ...'' అమ్మ కాఫీ కప్పు అందిస్తూ అంది.

''ఇప్పుడెందుకు...'' నాన్న అయిష్టంగానే అందుకున్నాడు.

''సాయంత్రం నించీ తాగలేదుగా అందుకే కలిపాను.... ఇష్టం లేకుంటే సగం తాగి నాకిచ్చేయండి...'' నాన్నకి ఎదురుగా విలాసంగా కూర్చుంది.

అమ్మ ఆలోచనల్లన్నీ ఆ కాఫీ కప్పులో నింపి ఇచ్చినట్లుంది. ఒక్కో గుక్క గొంతులోకి వెళ్తోంటే... ఒక్కో ఆలోచన మొదలౌతూ ఉంది ఆయన్లో.

''కరెక్టుగా ముహూర్తం రోజు వెళ్తే ఏమయినా అనుకుంటారు...''

''రాజీకి క్లాసులు పోతాయి...'' అమ్మ ఏదో చెప్పే ప్రయత్నం చేసింది.

''నన్ను కాస్త ఆలోచించుకోనీ విజయ... ఇంకా టైముందిగా...''

''టైముందీ.. టైముందీ అని ఒన్ వీక్‌నుంచి చెప్తూనే ఉన్నారు.'' అమ్మ ఏదో కొనసాగింపు మొదలు పెట్టింది. ఏదో చెప్తూనే ఉంది.

నాన్న చేతివేళ్లు రిమోట్‌ని నొక్కుకుంటూ ఉంటే కళ్ళు ప్లాస్మాటీవీని అతుక్కుపోయి అటూ ఇటూ నాట్యమాడుతున్నాయి.

నాకు తెల్సు నాన్న అప్పుడప్పుడూ అమ్మ ముందు మౌనంగా ఉండిపోవటం అలవాటు చేస్కున్నాడని. తనే ఆ విషయం చాలాసార్లు నాతో చెప్పాడు కూడా.

ఢిల్లీ అభాగ్యనగరం. ఇక్కడ మంచు ఎక్కువ. మమతలు తక్కువ.

''నవీన్ కూడా ఫోన్ చేశాడు డాడీ... ఎప్పుడు బయల్దేరుతున్నారు.. అని...'' నాన్నవైపు చూడకుండానే అన్నాను. అందరి ప్లేట్లలోని బ్రెడ్‌ని ఎంతో సునాయాసంగా ముక్కలు చేస్తున్నాయి వేళ్ళ మధ్య చాకచక్యంగా కదుల్తున్న బ్రెడ్‌నైఫ్స్.

''రేపు ఈవినింగ్ ఫ్లైట్‌కి టికెట్లు బుక్ చేశాను. అందరూ లగేజ్ సర్దుకోండి... ఓ టెన్ డేస్‌కి సరిపడా...''

''టెన్ డేసా...'' రాజీ, అమ్మ ఇద్దరూ ఒకేసారి నోళ్ళు తెర్చారు.

''అవును టెన్ డేస్. మీరు సరిగ్గానే విన్నారు. సిర్ఫ్ దస్ దిన్...'' నాన్న నవ్వాడు.

''బట్ డ్యాడీ. ఎలా కుదుర్తుంది. నాకు క్లాసులు పోతాయి...'' రాజీ తల పట్టుకుంది.

''ఫర్వాలేదు స్పెషల్ క్లాసెస్‌లో జాయిన్ అవొచ్చు...'' నాన్న తీర్మానించాడు. శాసించాడు.

అమ్మ వంద చెప్పింది. నాన్న మౌనంగా అన్నీ విని టికెట్లు తెచ్చాడు. ఢిల్లీ టూ రేణిగుంట. మేం బయటికి వచ్చేసరికి మాకోసమే అన్నట్లు నిలబడి ఉన్నాడు నవీన్. లగేజీలన్నీ 'క్వాలిస్'లో సర్ది బండి స్టార్ట్ చేశాడు.

నవీన్ స్వయాన నాకు అత్తకొడుకు. ఇప్పుడు వెళ్తుంది వాడి చెల్లెలి పెళ్ళికి. అంటే మా నాన్న చెల్లెలి కూతురి పెళ్ళి.

''డ్రైవర్ లేడా... నువ్వే డ్రైవ్ చేస్తున్నావ్...'' రేణిగుంట దాటి హైవే మీదకి వచ్చాక అన్నాడు నాన్న నవీన్‌తో.

''పాతబండికి పంపించాను. నాన్నవాళ్ళు పెళ్ళి పనులకి వెళ్తున్నారు. ఈ బండి తెచ్చి నాల్గు రోజులయింది. తాతయ్య మీకోసమే కొన్నారు. మీరు వస్తే తిరగడానికి ఇబ్బంది పడ్తారని అమ్మమ్మ చెప్పింది... అందుకోసం తెప్పించారు..'' నవీన్ చెప్తూ ఉంటే... నాన్న గుండె ఎందుకో కాస్త ఉద్వేగానికి లోనయినట్లు గమనించా.

''మేముండే నాలుగు రోజుల సంబరానికి, అన్ని లక్షలు పెట్టి బండి కొనటం ఎందుకురా...''

''ఆ మాట ఎవరో అంటే అమ్మమ్మ అంతెత్తున ఎగిరిందట. నిమిషాల ప్రకారం నాన్నని పంపి తెప్పించింది. అయినా అమ్మమ్మకీ, తాతయ్యకీ... నువ్వంటే చాలా ప్రేమ మావయ్య...''

నవీన్ ఏదో చెప్పుకుంటూ వెళ్తున్నాడు....

''ప్రేమ...'' ఆ పదం నన్ను వెంటాడుతూ ఉంది. ఈ మాటే.. నన్నూ నానమ్మనీ విడదీసింది. ఇప్పుడు నన్ను వెంటాడుతూ ఉంది కూడా.

చాలా ఏళ్ళక్రితం అప్పుడు నాకు పది పన్నెండు సంవత్సరాలు. మేం హైదరాబాదు బంజారాహిల్స్‌లో ఉండేవాళ్ళం. నానమ్మ వాళ్ళింటికి ఎప్పుడయినా వస్తే ఎంతో ఆనందంగా గడిచేది.

''నువ్వెందుకు నానమ్మ ఇక్కడా. నువ్వూ తాతయ్య వచ్చేయ్ కూడ్దు...'' అన్నాను.

''అంతదూరం ఎట్టా వచ్చేను పార్థూ...'' అంది నానమ్మ.,

''ట్రెయిన్‌లో. అక్కడే ఉండిపో...'' అన్నాను.

నానమ్మ మెడచుట్టూ చేతులేసి.

"ఇక్కడ నవీన్‌నీ, రాణినీ, మీ అత్తయ్యని వది లేసి వస్తే వాళ్ళకి కోపం రాదూ..." అంది.

"అయితే నువ్వు మాతో రాకుంటే నాకూ కోప మొస్తుంది. నీకు నేనూ, రాజీ అంటే ఇష్టంలేదు. ఆ నవీన్‌గాడు, రాణీ దెయ్యం వాళ్ళంటేనే ఇష్టం. వాళ్ళ తోనే ఉండు. నేనింక నీదగ్గరకు రాను..." ఆ క్షణంలో అమ్మతనాన్ని పూర్తిగా నింపుకున్న నానమ్మ కళ్ళు నదులవ్వటం నాకింకా గుర్తే. అప్పుడు నాకు తెలీదు నేనెంత నిర్దయగా మాట్లాడానో.

"ఏం నవీన్... నువ్వింకా ఆ వ్యవసాయమేనా ఇంకా ఏదైనా చేస్తున్నావా..." అమ్మ నవీన్‌ని ప్రశ్నిస్తూంటే మరలా నవీన్ ఏదో చెప్పుకుపోతున్నాడు.

బండి నెల్లూరు దాటి బుచ్చిరెడ్డిపాళెం వైపు పరుగులు తీస్తూ ఉంది. "నిదానంగానే వెళ్ళు నవీన్..." నాన్న అలా చెప్తున్నాడేగానీ ఎంత తొందరగా వెళ్దామా అన్నట్లుంది ఆయనకి. ఆయన బాల్యం, యవ్వనం అక్కడే గడిచింది.

"ఏసి... ఆఫ్ చెయ్ నవీన్..." నాన్న పూర్తిగా డోర్ గ్లాస్ ఓపెన్ చేశాడు.

పచ్చటి చెట్ల పరిమళం. అవును మీకు తెలీదా. చెట్లకూ పరిమళం ఉంటుంది. చెట్లకీ జీవచలనం ఉందని అవి కూడా మనిషి ముట్టుకున్న వెంటనే స్పర్శని బట్టి మాట్లాడగలవని తేల్చారు శాస్త్రవేత్తలు.

ఎటుచూసినా పొలాలు వాటిమధ్య ప్రవహిస్తున్న పిల్ల కాలువలు. దారిపొడవునా బండికి గేదెలు అడ్డొస్తుంటే వాటిని సునాయాసంగా తప్పిస్తున్నాడు నవీన్.

"ఇది పెద వెంకటరెడ్డి పొలం గదా..." ఏపుగా పెరిగిన అరటితోటనే గమనిస్తున్నాడు నాన్న.

"అవును మావయ్య. కానీ ఆయన చనిపోయాక కూతుళ్ళు పొలం అమ్మేసి అమెరికా వెళ్ళిపోయారు."

ఆలోచనలో పడ్డాడు నాన్న.

ఊరు మరో రెండు కిలోమీటర్లే ఉంది. నాన్న ముఖంలో రంగులు మారటం గమనించా. ఎటో చూస్తున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు.


"పెద్ద కాలవ లాకుల దగ్గర కాసేపు ఆపు నవీన్..." నాన్న ఏదోలోకంలో ఉండి మాట్లాడుతున్నాడు.

ఎందుకో అమ్మలోనూ హఠాత్తుగా ఒక కొత్త ఆనందం ప్రవేశించింది.

నవీన్ లాకుల దగ్గరి బండి ఆపగానే ఒక్కసారిగా ఇద్దరూ డోర్లు తెరిచి దిగిపోయారు. కనీసం మమ్మల్ని రమ్మనలేదు. లాకుల దగ్గరకు వెళ్ళి ఏవేవో నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. అమ్మ నాన్న భుజం మీద గట్టిగా కొడ్తూ ఉంది. నాన్న అమ్మని తనవైపుకి తిప్పుకుని నీళ్ళలో తోయబోయి మరలా గట్టిగా పట్టుకున్నాడు.

ఇద్దరు భార్యాభర్తల్లా లేరు. వాళ్ళిప్పుడు ఇద్దరు ప్రేమికులు.

ఈ ప్లేస్‌కి వాళ్ళకీ ఏదో ఆత్మీయ సంబంధం ఉందని అర్థమయింది. నాన్న ప్యాంట్ జేబులోంచి



కాయిన్స్ తీసి అమ్మకిచ్చాడు. ఆవిడ వాటిని నీళ్ళ లోకి వేసి చేతులు జోడించి నీళ్ళకి నమస్కరించింది. నీళ్ళు కూడా దేవుడని అర్థమైంది నాకు.

లాకుల పక్కనే ఒక మీటరు వ్యాసార్థంతో సిమెంటు బాట. దానిమీద ఇద్దరూ హాయిగా నడిచి వెళ్తున్నారు వాళ్ళు... ఒకరి చేతులు ఒకరు పట్టుకుని.

వాళ్ళిద్దరూ ఆగ్రాలో యమునా నది ఒడ్డున కూడా అలా నడవలేదు.

ఇదంతా హాయిగా వీడియోలో బంధిస్తుంది రాజీ. కొన్ని అపురూపమైన జ్ఞాపకాల్ని భద్రపర్చుకోవాలి. బ్రతుకులోని తడి కరువయినప్పుడు ఆ జ్ఞాపకాలే మనిషిని సేదతీరుస్తాయి. చాలా సేపటికిగ్గాని తిరిగిరాలేదు ఇద్దరూ.


ఎండకి అమ్మ మొఖం ఎర్రబడింది. కానీ 'ఆనందం' చెరిగిపోలేదు.

''అదేంటి మమ్మీ చిన్నపిల్లలై పోయారు ఇద్దరూ...'' అంది రాజీ కెమెరా స్విచ్ ఆఫ్ చేస్తూ ''ఇక్కడ మేం చిన్నపిల్లలమే...'' నవ్వుతూ కూర్చుంది మమ్మీ.

తాతయ్య వాళ్ళింటి ముందుకి బండి చేరంగానే అందరూ ఇళ్ళల్లోంచి పరిగెత్తుతున్నట్లే వచ్చారు. అమ్మ, నాన్న ఇద్దరూ దిగిన తర్వాత మేమూ దిగాం. తాతయ్య, నానమ్మ రెండవ అంతస్థు నుంచి మమ్మల్నే చూస్తున్నారు.

అత్తయ్య పళ్ళెంలో ఎర్రనీళ్ళు వాటిలో ఏవేవో వేసి మమ్మల్ని దిష్టి తీసింది. దిష్టినీళ్ళ పళ్ళెం పక్కన పెట్టి నాన్న ఒడిలో తుఫానుకి కొట్టుకుంటున్న చెట్టులా ఏడుస్తూ కదిలిపోయింది. నాన్న శరీరంలో ఎక్కడో ఏదో అలజడి... అంతే ఒక దుఃఖపు చెరువుకి గండి పడింది. ఎంత ఆశ్చర్యం. ఆయన పిల్లవాడికి మల్లే ఏడుస్తున్నాడు చుట్టూ ఉన్న బంధువులు, స్నేహితులూ అంతా.

అంతకంటే గొప్ప ఆశ్చర్యకరమైన అంశం ఎంతో హుందాగా ముఖానికి వేస్కున్న మేకప్ ఎక్కడ చెరిగిపోతుందో అనుకుని నుదుటిమీద చెమట బిందువుల్ని కూడా అంటీ అంటనట్టు కర్చీఫ్‌తో అద్దే అమ్మ కళ్ళలోంచి ధారాపాతంగా నీళ్ళు. అత్తయ్యని కౌగిలించుకుని భోరున ఏడ్పు.



ఏమయింది వీళ్ళకి...

ఈ మనుషుల్లో ఈర్ష్యాద్వేషాలే కాదు; పగలూ ప్రతీకారాలే కాదు.. మనసులూ మమతలూ ఉన్నాయి. ఇన్నాళ్ళూ నా తల్లిదండ్రులు ఎందుకో తమ గుండె గదిలో అజ్ఞాతంగా వాటిని బంధించి పెట్టారు. ఆ గదికి గొళ్ళాలు బిగించారు. దానికి తాళం బిగించి ఆ రహస్య తాళం చెవిని ఎక్కడో పోగొట్టుకున్నారు. ఇప్పుడు తలుపులే గొళ్ళాల్ని, తాళాల్ని ఒక్కసారిగా తెంచి... స్వచ్ఛంగా మనిషిని తమలోకి ఆహ్వానించాయి. రాజీ ఏడుస్తుంది... బహుశా నేను కూడానేమో.

రాజీని కౌగిలించుకుంది అత్తయ్య. ముఖమంతా ముద్దులు పెట్టింది. నన్నూ అంతే. ఎంత ఆత్మీయమయిన స్పర్శ అది. అమ్మ తర్వాత అటువంటి స్పర్శని అత్తయ్యలోనే చూశా. పరుగు పరుగున నాన్న మేడమెట్లెక్కి పైకెళ్ళిపోయారు. ఇంక ఆగలేనన్నట్టు.

ఆయన తన సృజన లోకాన్ని వెతుక్కుంటున్న అన్వేషి.

నాకు మల్లే ఆయనకీ తల్లిదండ్రులున్నారు. మమ్మల్నందర్నీ వదిలేసి వాళ్ళదగ్గరికి వెళ్ళిపోయాడు. అమ్మని కింద గదిలో అందరూ చుట్టుముట్టేశారు. నేనూ రాజీ ఒంటరిగా మిగిలిపోయాం. రాజీ బహుశా ఇంకా ఏడుస్తూనే ఉంది.

నేను ఊహించలేదు.. ఊహించలేను... కానీ కొన్ని రోజుల తర్వాత నాకర్థమయింది ఆ రోజు పై గదిలో ఏం జరిగి వుంటుందో...

నాన్న రక్తమాంసాల శరీరం మొత్తం కరిగిపోయి ఉంటుంది. ఇదొక జీవంతో తొణికిసలాడ్తున్న దృశ్యం. దుఃఖిత స్పర్శని గుండెలకి హత్తుకున్న సందర్భం అది.

నేనూ, రాజీ... మేడమీదకి వెళ్ళాం... నాకు తెల్సు... అప్పటికి తుపాను వెళ్ళిపోయి చాలా సమయమే అయింది.

విశాలమయిన గది. మూడు సోఫాలు మధ్యలో అందమమయిన జర్మన్ బ్లాక్‌గ్లాస్ టీపాయ్. నాన్న సోఫాలో పూర్తిగా కూలబడినట్లు కూర్చున్నాడు. బహుశా ఇప్పుడాయన, నింది తుడు.. దోషి రాక్షసుడూ... మనిషి.. అన్నీను.

మమ్మల్ని చూడంగానే నానమ్మ పెదవులు వణకటం మొదలుపెట్టాయి. ఆవిడ రెండు చేతుల నిండా బంగారుగాజులు. అనుభవాల నల్లచారికలు కళ్ళని వలయాలుగా చుట్టేసిన జ్ఞాపకాల గుర్తుల తెల్లవెంట్రుకలు. తలనిండా మెరిసిపోతున్నాయి. కళ్ళమీద నుండి అద్దాల్ని తీసి టీపాయ్ మీద ఉంచి మమ్మల్ని ఆహ్వానించింది. నేనూ రాజీ ఆవిడకి చెరో పక్కనా కూర్చున్నాం....

పధ్నాలుగేళ్ళు... మమతల్ని పోగొట్టుకుని... గుండె గూటిని చీకటితో నింపుకున్న ఆ మనిషి... నాన్నమ్మ మమ్మల్ని హత్తుకుంది. బహుశా మాకు తెల్సి మమ్మల్నిద్దర్నీ ఎవ్వరూ అలా హత్తుకున్న జ్ఞాపకమే లేదు. రాజీ ఇంకా ఏడుస్తూనే ఉంది.


అసలీ పిల్లకి ఏడ్పు ఎక్కడిది. ఎక్కడ నేర్చుకుంది అది కావాలీ... ఇది కావాలీ అని 'అలగటం' తప్పించి... అవును... అది 'స్త్రీత్వం'! నిజమే. తనలో ఇప్పుడది మేల్కొంది.

పేగు కోస్తున్నప్పుడు మంత్రసాని కూడా విలవిల్లాడిపోతుందట. అంతా స్త్రీత్వం. రెండు రోజులకిగానీ ఎవరం మనుషులం కాలేకపోయాం.

మమ్మల్ని ఎక్కడెక్కడో తిప్పాడు నాన్న. ఆయన నడిచి విడిచిన జ్ఞాపకాల్లోకి కాలవగట్లలోకి... పొలాల్లోకి, తోటల్లోకి.

పెద్ద కాలవలోకి అమాంతం దూకి ఈత కొట్టాడు. నాన్నకి పిచ్చి పట్టింది. పొలంలోకి దిగి అమ్మానాన్నా ఇద్దరూ కలుపు తీశారు. రెండు నిజదేహాలు మట్టిని ప్రేమిస్తున్నాయి. నిజమైన ఆశ్వాదన అది. ఎంత మారిపోయింది అమ్మ అలిసి పడుకుంది పట్టె మంచంమీద.

మేం ముగ్గురం తోటంతా తిరిగి వస్తూ ఉంటే ఇద్దరు ముసలోళ్లు ఎదురు పడ్డారు.




''నువ్వు దశరథరామిరెడ్డి కొడుకువి గదొరే...'' అన్నారు.

''అవును...'' నాన్న చూపులు నేలని తాకుతున్నాయి.

ఇక్కడ నాన్న పేరు ఎవ్వరికీ తెలీదు. ఆయన పరిచయమంతా ప్రపంచానికి 'దశరథరామిరెడ్డి' కొడుకుగానే.

అమ్మ ఏదో తన్మయాన్ని పొదవిపట్టుకున్న దానిలాగ ఆనందంగా నిద్రపోతూ ఉంది. ఏదో ప్రపంచంలో తిరుగుతూ ఉంది.

ఎవరో నలుగురు నాన్న వయసులో ఉన్న వాళ్ళు మా దగ్గరికి వచ్చారు. నాన్న మమ్మల్ని వదిలిపెట్టి వాళ్ళతో వెళ్ళిపోయారు. దూరంనుండి మళ్ళా మమ్మల్ని పిలిస్తే వెళ్ళాం. ''వీళ్ళు నా పిల్లల్రా... పెద్దోడు పార్థు, అమ్మాయి రాజేశ్వరి...'' పరిచయం చేశాడు.

''మేం అంతా సావాసగాళ్ళం అబయా. మీ నాయనా మేమూ అంతా ఎప్పుడూ ఈణ్ణే ఉండేది. పది పది హేనేళ్ళ తర్వాత వచ్చిండు... ఆ... యేందో ... రాండి కల్లు చెట్లకాడికి బోదాం...'' అన్నారు వాళ్ళు ముందు నడుస్తా.

ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళం చూస్కుంటుంటే... నాన్న మమ్మల్ని పట్టించుకోకుండా వెళ్తున్నాడు వాళ్ళవెనక.

మేం తిరిగి వచ్చేసరికి అమ్మ మంచంమీద లేదు. ఎక్కడకెళ్ళిందబ్బా అనుకుంటూ ఉంటే బోరుదగ్గర అన్నాలు తినే అరుగుదగ్గర గుంపుతో కల్సి దాయాలాడ్తూ ఉంది. ''దాయం.... దాయం మూడు... నీ కాయసచ్చింది. మళ్ళా పై పందెం. బారా... బారా నాలుగు...'' అమ్మ ఎంతో నేర్పుగా కాయలు కదుపుతూ ఉంది.

ఇప్పుడు అమ్మకి లూజుగా అల్లుకున్న జడ లేదు. నానమ్మ మాదిరిగా కొప్పు చీరకుచ్చిళ్ళు కూడా అస్తవ్యస్తంగా బొడ్లో దోపుకుని ఒక కాలు మడిచి కూర్చుని మరొక కాలు మోకాలు లేపి కూర్చోనుంది. ఎంతో విలాసంగా కూర్చునే అమ్మకీ ఈవిడకీ ఎంత తేడా. నాకిప్పుడు నా కళ్ళకి నిజమైన అమ్మ కన్పిస్తూ ఉంది.

''ఒమే... ఆ అమ్మి ఇదంతా 'ఈడవా' తీస్తా ఉందిమే...'' గుంపులో సన్న కదలిక ఆ మాటతో

''రాజీ.... వెళ్ళు నువ్వు'' అంది అమ్మ...

''నువ్వురా మమ్మీ. డాడీ కూడా వాళ్ళ ఫ్రెండ్స్‌తో వెళ్ళాడు...'' కెమెరా ఆఫ్ చేసింది రాజీ.

''ఆట మధ్యలో యట్టొస్తానే... వెళ్ళు నువ్వు...'' అమ్మ భాష కూడా మారిపోయింది.

వీళ్ళు ఇక్కడి రక్తంలో ఉన్నారు. ఇక్కడి గాలిలో ప్రవహిస్తున్నారు. జీవన వాస్తవికతని అనుభవిస్తున్నారు. ఇన్నాళ్ళూ ఇదంతా ఎందుకు దాచుకున్నారో అర్థం కావటం లేదు. మనిషికీ మనిషికీ మధ్య ఒకే కుటుంబంలో ఎందుకింత హుందాతనాన్ని అలవాటు చేస్కున్నారు.

దీన్నే అంటరానితనం అనొచ్చు.

ఈ అంటరానితనమే తల్లీబిడ్డల మధ్య, అత్తాకోడల్ల మధ్య, అన్నా తమ్ముళ్ళ మధ్య రాజ్యమేల్తా

ఉంది. ఇది మానవ సంబంధాల్ని విచ్ఛిన్నం చేసి కూర్చుంది. తనవైపుకు తిప్పుకుంది. కొంత కాలానికి మనిషిమీద ఆధిపత్యం చెలాయించటం నేర్చుకుంది.

ఎంత అవసరం ఉంది దీన్తో మనిషికి? అర్థం కావటం లేదు. నేనెప్పుడూ నాకు ఊహ తెల్సిన దగ్గర్నించి యాంత్రికమయిన బ్రతుకునే అనుభవించాను. చూశాను స్వతంత్రత లేదు. ఫలానా చదువు... ఫలానా వ్రాయి... ఎగ్జామ్స్, కంప్యూటర్స్... ఇదే జీవితం

లేదు... లేదు... ఏదో ఉంది. అదే వాస్తవం. ప్రస్తుతం మా జీవితాలు యాంత్రికంగా నడిపిస్తుంటే... దాని ప్రకారం నడుస్తున్నాయి.

ఆ రాత్రి నాకు నిదురలేదు. రాజీకి కూడా. తాతయ్య ఇంకా ఏదో సర్దుతూనే ఉన్నాడు. నేనూ రాజీ వెళ్ళాం. అందమైన ఆల్బమ్స్‌ని ఒక్కొక్కటిగా బీరువాలోంచి బయటికి తీస్తుంటే నానమ్మ వాటిని చూస్తూ కూర్చుంది.

మెల్లగా వెళ్ళి మేం పక్కనే కూర్చున్నాం.

''రండి... ఏరా నిదరరాలేదా?'' గుండెల్లోని అనురాగాన్ని గొంతులోకి తెచ్చుకుంది నానమ్మ.

''లేదు... ఏం చేస్తున్నావ్... నానమ్మ ఇంకా...''

''ఏవుంది మేం అప్పుడప్పుడూ చేసేదే... మీ నాన్నవి.. అమ్మవి పాత ఫొటోగ్రాఫ్స్...'' ఆల్బమ్‌ని చేతిలోకి తీస్కుని మాకు అందిస్తున్నప్పుడు ఆవిడ చేతులు సన్నగా వణుకుతున్నాయి.

మా ముందు ఒక కొత్తలోకం సాక్షాత్కారమయ్యింది.

''ఇదీ మీ నాన్న ఐదేళ్ళప్పుడు... ఇది అత్తయ్య... తాతయ్య... ఈయన తాతయ్య వాళ్ళ తమ్ముడు...'' నానమ్మ చెప్పుకుపోతూ ఉంది. ఎంత జాగ్రత్తగా భద్రపరిచారో.

బహుశా ఎక్కడో లోలోపలి రహస్యపొరల్లోని రక్తం కన్నీటిగా రూపాంతరం చెందుతుంది నాలో. మేమెవరం గుర్తించని జ్ఞాపకాల బంధాలు ఏవో వీళ్ళు పెనవేసుకుని బ్రతుకుతున్నారు.

''ఇది మీ నాన్న సంపాదించిన గోల్డ్ మెడల్... మా వంశంలో వాడే బంగారు పతకాన్ని సాధించింది.''

అల్మారా తాళం తీసి దానిలోంచి బంగారు పతకాన్ని బయటికి తీశాడు తాతయ్య.

రాజీ ఏదో లోకంలోకి వెళ్ళిపోయింది. ఒక్కొక్క ఆల్బంమీద ఒక్కొక్కరి పేర్లు. పార్థు... పార్థు... నా చిన్నప్పటి చిత్రాలు. మా దగ్గరకూడా లేనివి. నా కాలేజీ ఫొటోలు. నేను నేషనల్ ర్యాంక్ సాధించినప్పటి ఫొటో... ఆల్బంలోనే కాదు...

ఆ గదినిండా... వాళ్ళ గుండెలనిండా మా జ్ఞాపకాలు. మా బ్రతుకులు వీళ్ళ జ్ఞాపకాల ముందు నిష్ప్రయోజనం. మేమంతా మానవ సంబంధాల మీద నమ్మకం లేని మైనపు బొమ్మలం.

''మీ నాన్నకి సంగీతం అంటే చాలా ఇష్టం. వాడు వాడిన టేప్‌రికార్డర్... వాడి క్యాసెట్లు, సూట్‌కేస్...'' ఒక్కొక్కటిగా మాముందు పరుస్తున్నాడు తాతయ్య.

నాలో ఏవో స్వప్నాలు కదలాడుతున్నాయి.

''మేమంటే ఎంత ఇష్టం నానమ్మా నీకు...'' రాజీ కన్నీళ్లు తుడ్చుకుంటూ అంది.

''మీరంటే ఇష్టంలేదని అనుకునే కదమ్మా... మీ అన్న కూడా... నన్ను వదిలి వెళ్ళిపోయాడు...'' నానమ్మ మాట నా గుండెనే ఛిద్రం చేసింది. ఖండ ఖండాలుగా చీలిపోయా న్నేను. ఎవరు వీళ్ళు. ఏమౌతారు మాకు. అసలు మనిషికీ... మనిషికీ మధ్య ఏంటి ఈ ఆకర్షణ. ఎక్కడినుండి మొదలయిందీ పర్వం.

ఎందుకు వీళ్ళకి దూరంగా ఉంటున్నారు అమ్మానాన్న. ఏమయింది. ఎక్కడ ఈ జీవన విధ్వంసం మొదలయింది. విషాద చిహ్నాలుగా వీళ్ళనెందుకు మిగిల్చారు. వీళ్ళేకాదు. ప్రపంచం నలుమూలలా ఇంటికి ఒకళ్ళు ఇలా జ్ఞాపకాల్లోనే దహించబడుతున్నారు. ఇలాంటివాళ్ళకి ఇది శాపమా. ఎందుకీ శాపం?

అంతా చూస్తున్నాను. ఎక్కడో ఏదో అపశృతి. దాన్ని సరిచేయాలి. కొమ్మలన్నీ విరిగిపోయి చెట్టు మాత్రమే ఒక వికలాంగ చిహ్నంలా బ్రతకడంలో అర్థమేలేదు.

ఆ రాత్రి నాన్ననే అడిగాను.

''ఇలా ఎందుకు వెళ్ళాల్సి వచ్చింది నాన్న వీళ్ళని వొదిలి. మన సొంత ఇంటినీ... ఈ మనుషుల్ని... ఇక్కడి బ్రతుకుని వదిలి...''

నాన్న కళ్ళు పుష్పిస్తున్నాయి. నవ్వాడు నాన్న. ఎందుకో అదొక వైరాగ్యపు నవ్వులా లేదు. అదొక నిర్లిప్తత. అసహాయత. రాజీని దగ్గరకి తీస్కున్నాడు. బుజంమీద చేయివేసి మేడమీద నడవటం మొదలుపెట్టాడు.

''మనం చాలా అనుకుంటాం పార్థు. కొన్ని జరుగుతాయి. కొన్ని జరగవు. కొన్నింటిని కావాలీ అనుకుంటాం. అటువంటప్పుడు కొన్నింటిని వదులుకోవాల్సి వచ్చింది. మీ అమ్మ కోరికల కోసం నేను మా అమ్మా నాన్నలకి దూరమయ్యాను.... అందుకు వాళ్ళు నన్ను త్యాగం చేయాల్సివచ్చింది...''

నాన్న ఏదో చెప్పుకుపోతున్నాడు. నాన్న చెప్పిందాంట్లో అర్థముంది. కానీ ఏదో మతలబుంది. తనని తాను సమర్థించుకోవడానికే అన్నట్లూ ఉంది. కానీ ఆ మార్గం కరెక్టుగానే ఉంది. ''మొదట్లో బాగానే ఉంది. తర్వాత... తర్వాత ఎందుకో మీ మమ్మీకి ఇక్కడ ఉండటం ఇష్టంలేదు. అదీకాక మీ చదువులు, మిమ్మల్ని చదివించాలి... ఇక్కడుంటే కుదర్దు. మిమ్మల్ని చదివించి అమెరికా పంపించాలి. అది ఆవిడ కోరిక. దాన్ని తీర్చాల్సిన బాధ్యత నాది.

ఇది చాలా సున్నితమయిన అంశం. మనం ఏదయితే కోల్పోయామో అది అనుభవంలోకి వచ్చి మనల్ని ప్రశ్నించినప్పుడు తప్ప అర్థంకాదు...''



ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040 - 23747777, 9391999999

FREE online Registration &
Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com



| | |
|---|---|
| అమీర్‌పేట్ | నెల్లూరు |
| కూకట్‌పల్లి | తిరుపతి |
| దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు |
| విజయవాడ | (చెన్నయ్) టి.నగర్ |
| గుంటూరు | బెంగుళూర్ |
| తెనాలి | సేలం |
| విశాఖపట్నం | మధురై |
| రాజమండ్రి | వెల్లూరు |
| కాకినాడ | తిరుచి |
| | పాండిచ్చేరి |
| ఖమ్మం | ఈరోడ్ |
| ఒంగోలు | అనంతపూర్ |

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.


నాన్న ఏదో చెప్పాడు తెలివిగా. బహుశా అది తనని తాను సమర్థించుకోవడానికే అయి ఉండవచ్చు. కానీ దాంట్లోనూ ఆయన అసహాయత, నిజాయితీ లేకపోలేదు. అలాగని తప్పు కూడా లేకపోలేదు. అదీ ఉందీ ఇదీ ఉంది.

రాణీ పెళ్ళిరోజు అమ్మ మండపం మొత్తం పరిమళించిందనే చెప్పాలి. ఒకటే హడావుడి. అమ్మని చూసిన వాళ్ళంతా ఫలానా వాళ్ళ కోడలూ అనుకోవడమే.

రాణికీ తన తరపున డైమండ్ నెక్లెస్ ప్రెజెంట్ చేసింది.

ఎంతమంది మనుషులు... వాళ్ళలోని రకరకాల మనసులు. అన్నింటిలోనూ కాస్తంత ప్రేమ. అందులో తడి. ప్రతి మనిషిలోనూ కొంతలో కొంత ఆప్యాయత, అనురాగాలూ ఇంకా బ్రతికే ఉన్నాయి. అయితే అవి పాలల్లో వేయాల్సిన చేవిరి పరిమాణంలో ఉన్నాయి. దాన్ని పాలలో కలిపి మొత్తం పెరుగ్గా చేసి అందరికీ పంచగల్గిన సాహసం ఎవ్వరిలోనూ లేదు. మాకు తెల్సి మమ్మీకి మమ్మీ అనేపేరు లేదా డాడీ పిల్చే విజయ అంతే. కానీ యిక్కడ మమ్మీకి అనేక పేర్లు.. అక్క, అత్త, పిన్ని, పెద్దమ్మ, ఏంవే, విజ్జీ, రాక్షసీ.. ఎన్నో. ఎలా ఉండగల్గుతుంది... తనే ఇన్ని పాత్రల్ని వొదిలి.

ఈ మానవ వంశవృక్షాలకి ఎక్కడో చెదలు పట్టింది. ప్రక్షాళన చేయాలి. బంధువులంతా వెళ్ళి

పోయారు. మిగిలింది మేమే.

బట్టలు సూట్‌కేస్‌లో సర్దుతూ ఉంది అమ్మ.

''ఇంకా రెండు మూడు రోజులు టైం ఉందిగా మమ్మీ అప్పుడే సర్దుకుంటున్నావ్?...'' అన్నాను

అమ్మ కళ్ళ వెంట జల జలా రాల్తున్నాయి కన్నీళ్ళు. ఆశ్చర్యపోయాన్నేను.

''ఎందుకు మమ్మీ ఏడుస్తున్నావ్... వీళ్ళని వొదిలి వెళ్ళటం ఇష్టంలేదా. అలాంటప్పుడు ఇక్కడే ఉండి పోదాం...'' అమ్మ భుజాల చుట్టూ చేయివేసి పక్కనే కూర్చున్నాను.

''లేదు పార్థు... మనం వెళ్ళిపోవాలి. మనం వెళ్ళకుంటే... నేను ఈ ప్రేమలకి బానిసనైపోతాను. వీళ్ళముందు ఓడిపోతాను...''

''ఓడిపోవడమా... అదేంటి మమ్మీ...'' రాజీ ఆశ్చర్యంగా అడగింది తను చదువుతున్న పుస్తకం లోంచి తలెత్తి.

''నీకు తెలీదు రాజీ. మిమ్మల్నీ డాడీని వీళ్ళకి దూరం చేసింది నేనే. అంటే... ఇదంతా పరిస్థితుల ప్రభావం. ఎందుకో నేనిక్కడ ఇమడలేకపోయాను. ఒకింత అభద్రతా భావానికి లోనయ్యాను. బహుశా అది నా అప్పటి మానసిక స్థితి కావచ్చు. లేదా నన్నావహించిన కోరికల వలయమూ కావచ్చు..''

అమ్మ గబగబా వెళ్ళి ఫ్రిజ్ డోర్ తీసి నీళ్ళు తాగింది.

''ఎందుకో వీళ్ళందరిలోకి ప్రత్యేకంగా కన్పించాలనుకున్నాను. ఈ ప్రత్యేకతే నన్నింత దూరానికి లాక్కెళ్ళింది. నేనే దూరంగా ఉండాలనుకున్నాను. ఉన్నప్పుడు తెల్సుకున్నాను. ఏం సాధించానా అని. ఎన్నోసార్లు కుమిలిపోయేదాన్ని., మీరంతా బయటికి వెళ్ళిపోయినప్పుడు నేనొక్కత్తినే మిగిలిపోయి ఎవరూ లేని ఏకాకితనాన్ని అనుభవించి డిప్రెషన్‌కి లోనయిన సందర్భాలు ఉన్నాయి.

ఇప్పుడు నేను ఇక్కడికి వచ్చేస్తే నా అహం దెబ్బతింటుంది. ఇది నేను అనుభవించాలనుకున్న ఆనందాన్ని మింగేసి నన్ను జీవచ్ఛవాన్ని చేస్తుంది. ప్రతిరోజూ ఈ ముఖాలన్నీ నన్ను వెక్కిరిస్తాయి.. వద్దు... పార్థు నేను తప్పు చేశాను. కానీ ఆ తప్పుని ఒప్పుకునే ధైర్యం నాలో లేదు.''

ఎప్పుడు వచ్చిందో... నానమ్మ... గుమ్మం దగ్గర కన్నీళ్ళ చెట్టులా ఉంది. ఆవిడ వెనకే... నాన్న.

చిన్నగా... అడుగులో అడుగు వేస్కుంటూ వెళ్తొంది నానమ్మ. సోఫాలో కూలబడింది. ఆవిడ గుండెలో ఇంకా కన్నీళ్ళు మిగిలే ఉన్నట్లున్నాయి...

''నానమ్మా... మేము...'' ఏదో చెప్పబోయాన్నేను.

''వద్దురా పార్థు... ఆనకేం చెప్పొద్దు. మీరు చెప్పేది నేను వినే స్థితిలో లేను. మీరు వెళ్ళిపోండి వెళ్తున్నావని కూడా నువ్వు చెప్పొద్దు. ఎవ్వరికీ తెలీకుండా వెళ్ళిపోండి.

చిన్నప్పుడు నువ్వు నన్ను తిట్టి అలిగి వెళ్ళిపోయావే. మీమీద నాకు ప్రేమ లేదని చెప్పి వెళ్ళిపోయావే చూడు... అలాంటి మాట ఏదయినా ఉంటే చెప్పి వెళ్ళిపో... అంతే... నాకింకా బాధల్ని ప్రేమించే శక్తి ఉంది. మేం మీరు లేకుండా మీ జ్ఞాపకాల్లోనే బ్రతగ్గలం. వెళ్ళిపోండి...'' నానమ్మ కుమిలిపోతూ ఉంది... బహుశా నిలువెల్లా దహించబడ్తుందనే చెప్పాలి.

''రేపు ఉదయం బండి సిద్ధంగా పెట్టు నవీన్ మేం వెళ్ళిపోవాలి...'' నవీన్‌ని పిల్చి చెప్పాడు నాన్న

''అదేంటి మావయ్య నాల్రోజులు ఉంటానన్నావ్....''

నవీన్ వంక సూటిగా చూశాడు నాన్న. నవీన్ వెళ్లిపోయాడు. అత్తయ్యతో చెప్పినట్లు ఉన్నాడు... అత్తయ్య, మావయ్య వచ్చి మా నాన్నతో ఏదో వాగ్వివాదానికే దిగారు.

అత్తయ్య ఏడ్పు అధ్యాయాన్ని మరలా విప్పింది. అందరూ... అదే వరస నాకు కాస్త నవ్వ, కాస్త ఏడ్పు.

గతాన్ని మొత్తం అమ్మముందు తవ్విపోసింది అత్తయ్య.

ఎన్నో అంది. బంధువలంతా తలొక్కమాట అన్నారు. అర్ధరాత్రయినా ఎవ్వరూ కదల్లేదు. మమ్మీ, రాజీ లగేజ్ అంతా సర్దేశారు.

వర్షం... ఊరంతటినీ తడుపుతూ ఉంది. మా హృదయాల్ని తడిపే వర్షం ఇంకా రాలేదు... ఓ బర్షాత్ కబ్ హోగీకీ కిస్ కో పతా నహీ.... వర్షం ఆగిపోయింది. రాత్రంతా అందరూ అలాగే నిలబడి ఉన్నారు.

తాతయ్య, నానమ్మ తెల్లవార్లూ మేల్కొనే ఉన్నారు.

మేం బయలుదేరాం.

ఎప్పుడూ మేడమెట్లు దిగని నానమ్మ మాకోసం దిగివచ్చింది.

మా మధ్య మాటల పువ్వులన్నీ రాలిపోయాయి. వాడిపోయాయి. బండి కదిలింది. మమ్మీ మరలా ఎవర్నో ఎవర్నించో పూర్తిగా విడదీసింది... ఇదంతా.. ప్రేమభాష తెలియని మూగతనం. నిజమే మమ్మీ మరలా ఏదో పెద్ద తప్పే చేస్తూ ఉంది. దీనికి బహుశా ప్రాయశ్చిత్తమే లేదు.

ఊరుదాటాం... స్పీడ్ పెంచాడు... నవీన్...

మమ్మీ కనురెప్పలు మూసుకుపోయాయి... కళ్ళ ప్రవాహానికి కనురెప్పలు ఆనకట్ట కట్టలేవు.. ఎటో చూస్తూ ఉంది. ఎవరో పిలుస్తున్నారు మమ్మీని... గుండెల్లోంచి.. బ్రతుకులోంచి... జీవితం చివరి నుంచి... పెద్దకాలువ పక్కనుంచి వెళ్తున్నాం... ఎవరినో విడదీసింది మమ్మీ... అవును... యశోద పాడిన లాలిపాటల్నుంచి ఈ మట్టినుంచి... ఈ ప్రేమల్నుంచి తనని తానే విడగొట్టుకుంది.

ఆవిడ విడగొట్టుకున్న జ్ఞాపకాల్లో ఆవిడే కొట్టుకుపోతూ ఉంది. ఏదీ లేని తనం. ఏదీ మిగలని తనం. రిక్తహస్తాలతో యుద్ధరంగంలో నిలబడింది...

''నవీన్... బండి వెనక్కి తిప్పు...''

''ఎక్కడికి అత్తయ్య...'' సడన్ బ్రేక్ వేశాడు నవీన్...

మమ్మీ చేతివేళ్ళు నవీన్ భుజాన్ని గట్టిగా నొక్కిపట్టాయి...

మమ్మీలో ఇంకా జీవముంది . దాన్ని బ్రతికించుకోవాలని తపన పడ్తూ ఉంది.

''త్వరగా పద నవీన్... ఇంటికి ... తిప్పూ...''

అందరం కలలాంటి నిజంలోంచి ఇంటి ముందు ఆగాం... నానమ్మ అప్పుడే మెట్లెక్కడానికి శరీరాన్ని సిద్ధం చేస్కుంటూ ఉంది.

ఒక్కసారి డోర్ తెరుచుకుని ఉప్పెనై నానమ్మను చుట్టేసుకుంది మమ్మీ... భోరున... వాన... అలసిన మనసుల్నీ, బ్రతుకుల్నీ సేదతీర్చడానికి...

ఒక్కో నీలిమేఘం ప్రేమగా... ఆ అత్తాకోడళ్ళని తడిపేస్తూ ఉంది... క్షమించాలి... వాళ్ళిప్పుడు ... తల్లీ కూతుళ్ళు...

చాలాకాలం తర్వాత... ఓ రోజు మమ్మీ అంది మేడమీద విలాసంగా కూర్చుంటూ... ''ఒరే పార్థూ... రాజీ... ఇప్పుడూ నేనే గెలిచాను...''

నిజమే... ఇప్పుడు కూడా మమ్మీనే గెల్చింది. ఆ మాటకొస్తే ప్రేమదే జయం.

★

చిరునామా :
ఖాధర్ షరీఫ్ షేక్
క్వార్టర్ నెం. : ఎ/62
సోమశిల - 524301, నెల్లూరు జిల్లా
సెల్ : 9441938140

